క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై అవగాహన



నందిగామ: నియోజకవర్గంలోని ప్రతి సచివాలయ పరిధిలో ఈవీఎంల వినియోగంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో ఈవీఎంల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సర్పంచ్ పి.అరుణకుమారి ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల మేరకు పని చేయాలి

జుజ్జూరు(వీరులపాడు): ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేలా కృషి చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలతో పాటు ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు నడుచుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మఠం శివాలయంలో ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: మాఘమాసం, పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి (మఠం శివాలయం) ఆలయంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అన్నాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా వాణిజ్య కమిటీ చైర్మన్‌గా పురుషోత్తం



జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం కమిటీ చైర్మన్‌గా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కొత్త పురుషోత్తం నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు నుంచి శుక్రవారం తనకు నియామక పత్రం అందినట్లు పురుషోత్తం తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఆర్యవైశ్య సంఘం మండల ప్రెసిడెంట్‌గా, కృష్ణా జిల్లా వర్తక, వాణిజ్య కమిటీ చైర్మన్‌గా, సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో కేటాయించిన పదవీకాలంలో సంఘ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. పురుషోత్తం నియామకం పట్ల పలువురు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

కంచికచర్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గనిఆత్కూరు కృష్ణానది నుంచి అక్రమంగా విజయవాడకు ఇసుకను తరలిస్తున్న 8 లారీలను శుక్రవారం రాత్రి పట్టుకుని లారీలను స్టేషన్‌కు తరలించి శనివారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా రీచ్‌ల నుంచి కాని కృష్ణానది, మున్నేరుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఏసీబీ అధికారుల తనిఖీలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శనివారం ఏసీబీ అధికారులు అకస్మికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. కార్యాలయంలో నిశితంగా పరిశీలనలు చేశారు. ఈ సందర్భంగా అవినీతికి పాల్పడినట్లు ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో అధికారులు వెంటనే వెనుతిరిగి వెళ్లిపోయారు. ఏసీబీ అధికారులు పట్టణానికి వచ్చారనే సమాచారం ఆ నోటా ఈ నోటా వ్యాపించడంతో పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు టెన్షన్‌కు గురయ్యారు. ఏసీబీ అధికారులు వెళ్లిపోయారని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ అజెండా

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- రూ.4.09 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



తిరుమలగిరిలో గిరిప్రదక్షిణ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

తిరుమలగిరి(జగ్గయ్యపేట): అర్హులకు సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబాలను మెరుగుపరచటం, అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని తిరుమలగిరి, అనుమంచిపల్లి, అన్నవరం గ్రామాల్లో రూ.4.09 కోట్లతో నిర్మించిన రహదారులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో అర్హులందరికి సంక్షేమ పథకాలు ఇచ్చి ప్రభుత్వ పని తీరును నిరూపించిందన్నారు. పార్టీలకు అతీతంగా వాటిని అమలు చేయటంలో కూడా వివక్ష లేకుండా చేశారని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారని, వారిని ప్రజలు క్షమించరని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు.

తిరుమలగిరిలో..

గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన గిరిప్రదక్షిణ రోడ్డును విప్, టీటీడీ బోర్డు సభ్యుడు ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3.70 కోట్లతో అంతర్గత రహదారులు, సచివాలయలు, ఆర్‌బీకేలను నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు నరసింహారావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, రమాదేవి, నాయకులు జనార్దన్, రామారావు, వసంతరావు, పాల్గొన్నారు.

అనుమంచిపల్లిలో..

గ్రామంలోని జాతీయ రహదారి నుంచి తక్కెళ్లపాడుకు రూ.1.25 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఉదయభాను ప్రారంభించారు. అదే విధంగా గ్రామం నుంచి గిన్నె చెరువు మీదుగా బలుసుపాడు వెళ్లేందుకు రూ.కోటితో నిర్మించిన రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాలుగున్నరేళ్లలో రూ.22 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు. గంగమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు, మాడేలమ్మ ఆలయానికి రూ.50 వేలు, శ్మశానవాటిక అభివృద్ధికి డీఎంఎఫ్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. బూదవాడ శివారు గ్రామం త్రిపురవరం నుంచి రెడ్డి నాయక్ తండా వరకు రూ.కోటితో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. సర్పంచ్ పానుగంటి త్రివేణి నాయుడు, మండల పార్టీ కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, గ్రామ కన్వీనర్ కుందవరపు సుబ్బారావు, యూత్ కన్వీనర్ బజారు సాయి, నాయకులు పుల్లయ్య, గోపి, పంచాయతీ రాజ్ జేఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో..

గ్రామంలో రూ.14 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని విప్ ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సరిహద్దులో ఉండే గ్రామంలో అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.12.6 కోట్లను ఖర్చు చేశామన్నారు. సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కళావతి, గ్రామ కన్వీనర్ యలమంద తిరుపాదం, ఉప సర్పంచ్ బాణావత్ లక్ష్మీ సైదులు, నాయకులు మురళి, కృష్ణ, ప్రభాకర్, శ్రీను, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

జలబిందెలకు స్వాగతం పలికిన మహిళలు



జలబిందెలు తీసుకువస్తున్న వారితో ఆలయ చైర్మన్, నాయకులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లలో భాగంగా రెండో రోజు శనివారం జలబిందెల కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక మునేరులో పురోహితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఆచారం ప్రకారం ఐదు వంశాలకు చెందిన కర్ల రామకృష్ణ, సూరంపల్లి ఫణికృష్ణ, వడ్లమూడి భాస్కరరావు, నల్లపునేని నరేష్, గజ్జి శివకృష్ణ జలబిందెలు తలపై పెట్టుకోగా..వారికి అమ్మవారి సేవకులు పాపమాంబ వంశీకులు కంకణాలు ధరింపజేశారు. అనంతరం రజకులు, శాలివాహనులు బలి తిరిగిన అనంతరం మునేరు నుంచి జలబిందెలు బయలు దేరాయి. జలబిందెలకు మహిళలు నీటితో వార్లు పోసి ఘనస్వాగతం పలికారు. ఐదు కుండల్లో తీసుకు వచ్చిన నీటిని ఆలయంలో నవధాన్యాలు పోసిన మట్టి ముంతలపై చల్లుతూ ప్రతి రోజు తడుపుతారు. ఏగింజలైతే తొందరగా మొలకెత్తుతాయో ఆ ఏడాది ఆ పంటలు బాగా పండి, సకల సంతోషాలు కలుగుతాయని ప్రతీతి. మిగిలిన జలాన్ని పొలాల్లో చల్లటం ఆచారంగా కొనసాగుతోంది. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ పి.రాంబాబు, సిబ్బంది స్వాగతం పలికి నీరువార పోసి జలబిందెలకు నమస్కరించారు. గణాచారుల క్రతువులు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాలు, కొమ్ము ధ్వనులు, డప్పు మోతలతో గ్రామం మారుమోగింది. కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ మోతలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ ఏఈవో ఉమాపతి, పాలకవర్గ సభ్యులు కాకాని అలేఖ్య, బెజవాడ శ్రీనివాసరావు, పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరునికి పూజలు



శనీశ్వరునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వర నగర్‌లో వేంచేసియున్న సాయి అయ్యప్ప ఆలయంలో జ్యేష్టాదేవి సమేత శనీశ్వరుని శాంతి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ముందుగా కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తైలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడివాడ సాంబశివరావు, నాదెండ్ల నరేంద్ర, సముద్రాల మధుబాబు, అనుమోలు పార్థసారధి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

మైలవరం: మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9న మైలవరం కోర్టు పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామనిని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులను కక్షిదారులు రాజీ చేసుకుని వారి విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను ఆదరించాలని రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లోకరాజు అన్నారు. శనివారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు మండల విభాగం ఆధ్వర్యంలో భవిత కేంద్రానికి హాజరు కాలేని దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు వారి ఇంటి వద్దనే అవగాహన కల్పించారు. ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు చేయించారు.

విద్యార్థులకు ఈ-స్లేట్స్ అందజేత

రమణక్కపేట (ముసునూరు): విజయవాడ పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ నాగమోహనరావు రమణక్కపేట హైస్కూల్లో శనివారం మూడో తరగతి విద్యార్థులు 20 మందికి ఈ-స్లేట్స్ అందజేశారు. ఐదో తరగతి విద్యార్థులకు పెద్ద బాల శిక్ష పుస్తకాలు, పంచతంత్ర కథల పుస్తకాలు పంపిణీ చేశారు. రమణక్కపేట హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలో తలపడుతున్న శ్రీ వాసవి, సీఆర్ రెడ్డి కళాశాల జట్టు

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ 3వ క్వార్టర్ ఫైనల్ పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. శనివారం మూడవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల (గుంటూరు)జట్టు ఎస్‌ఆర్‌ఐ(ఆగిరిపల్లి) జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌ఆర్‌ఐ జట్టు నిర్ణీత ఓవర్లలో 135 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మెట్ 30 పరుగులు, యోహాన్ 29 పరుగులు చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్ ఆరంభించిన కిట్స్ జట్టు 20 ఓవర్లలో 112 పరుగులు మాత్రమే చేయగలిగింది. 23 పరుగుల తేడాతో ఎస్‌ఆర్‌ఐ విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. నాల్గవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ (ఏలూరు) శ్రీ వాసవి (తాడేపల్లిగూడెం) జట్ల మధ్య పోటీ జరిగింది. మొదట టాస్ గెలిచిన శ్రీ వాసవి కాలేజీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన సీఆర్ రెడ్డి కాలేజీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 46 పరుగులు సాధించింది. జట్టు ప్లేయర్ గగన్ 45 బంతుల్లో 55 పరుగులు తీశాడు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీ వాసవి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 102 పరుగులు మాత్రమే సాధించింది. సీఆర్‌రెడ్డి జట్టు ఘన విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య పర్యవేక్షించారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష



తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ సరస్వతి

నందిగామ: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరునాళ్లను విజయవంతం చేయాలని తహసీల్దార్ సరస్వతి సూచించారు. శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవాల ఏర్పాట్లపై పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శివరాత్రి ఏర్పాట్లు, భక్తులకు అసౌకర్యం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పలు శాఖల అధికారులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. తిరుణాల సందర్భంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, దాములూరు గ్రామ సర్పంచ్ గాదెల వెంకట రామారావు, ఆలయ ఈవో భూపాల్, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, ఫైర్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

ముసునూరు: గోపవరం శివారు నాగేంద్రపురంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర (నాగేంద్ర) స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ, విగ్రహాలు, శిఖరాల ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. వైదిక కార్యక్రమాల అనంతరం స్వామివారి దివ్య దర్శనం కల్పించారు. అనంతరం శాంతి కల్యాణం, కంకణ విమోచనం తదితర క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారు పుష్పమాలాంకృతులై గ్రామ వీధులకు ఊరేగింపుగా తరలివెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు.

పాడి రైతులకు వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి: గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను పాడి రైతులకు ఉచితంగా చేస్తామని డాక్టర్ వరుణ్ అన్నారు. శనివారం చిన్నగిరిపల్లి, నరసింగపాలెంలోని పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్, వరుణ్ కార్డియాక్ అండ్ సైన్సెస్, రాధా లక్ష్మి హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో గుండెకు సంబంధించిన పరీక్షలు, యాంజియోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. భవిష్యత్తులో పాడి రైతులకు ఆరోగ్య పరిస్థితిని బట్టి ఉచితంగా గుండెకు ఆపరేషన్ చేస్తామని డాక్టర్ వరుణ్ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన మాతంగి సైదేశ్వరరావు, మాడుగుల యాకోబు, బుడుగు శామ్యూల్ తదితరులు టీడీపీని వీడి శనివారం ఉదయభాను సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలతో పాటు ఆ వర్గాల అభ్యున్నతికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాయకులు పెద్దకాపు, శ్రీనివాస గౌడ్, నాగబాబు, బుల్లయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం



నూతనంగా ప్రారంభించిన కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ప్రజాప్రతినిధులు

కంచికచర్ల: నియోజకవర్గంలోని మండలాల ప్రజలకు అందుబాటులో ఉండి మరింత సేవలు అందించేందుకు, కంచికచర్లలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో శాసనసభ్యుని కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా వేద పండితుల ఆశీర్వచనాలతో పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ కేంద్రమైన నందిగామలో నాలుగు రోజులు, కంచికచర్లలో మూడు రోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ రెండు మండలాల ప్రజల అర్జీలను స్వీకరించేందుకు, సీఎంఆర్‌ఎఫ్ అర్జీలు తీసుకోవడానికి అందుబాటులో ఉంటుందన్నారు. రెండు మండలాల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయుక్తమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, నాయకులు కాలవ పెదబాబు, పాటిబండ్ల హరిజగన్నాథరావు, మాడుగుల శంకర్, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, కొరాటు పూర్ణచంద్రరావు, వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, వేమా శివకోటి, తంగెళ్లమూడి రామారావు, వెలగలేటి బాబు, ఎం శ్రీనివాసరెడ్డి, బీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక పాలనకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ఏటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విప్లవాత్మక పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలో ఏటూరు గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గత ప్రభుత్వాలకు భిన్నంగా పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా గతంలో మాదిరిగా తమ పార్టీకి చెందిన వారికే సంక్షేమ పథకాలు అందించకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు గతంలో కానీ భవిష్యత్తులో కానీ ఎవరికి సాధ్యం కాదని చెప్పారు. ప్రతిపక్షాలు ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మకుండా ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఘన విజయాన్ని అందించాలని కోరారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, ధనమూర్తి, రాము, వేణు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైయిన్ల నిర్మాణం

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో రూ. 10 లక్షలతో చేపడుతున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శనివారం శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. రూ.10 లక్షలతో గ్రామంలో ప్రధాన రహదారులలో డ్రెయినేజీలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో మురుగు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు చింతోటి వీరప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

ప్రభుత్వ విప్ ఉదయభాను



యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వైస్ చైర్మన్, కమిటీని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఇటీవల నూతనంగా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఉదయభానుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మనది రైతు ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు పెద్ద పీట వేస్తూ రైతు ప్రభుత్వంగా అనేక పథకాలు, సంస్కరణలు అమలు చేయడంతో పాటు విప్లవాత్మక మార్పులు చేపట్టారని తెలిపారు. పేట మార్కెట్ యార్డు ద్వారా చిల్లకల్లులో నిర్వహిస్తున్న మేకలు, గొర్రెల సంతతో పాటు ఆవులు, గేదెల సంత కూడా ఏర్పాటు చేయాలన్నారు. సంత ద్వారా వచ్చే ఆదాయాన్ని మరింతగా పెంచుకొని ఆవులు, గేదెలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. సంతలో కూడ ఎక్కడా అవకతవకలు జరగకుండా నూతన కమిటీ చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయభానును నూతన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ సభ్యులను ఉదయభాను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఎల్.బద్దూనాయక్, రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు కాసరగడ్డ రామారావు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు, నాయకులు పింగళి నర్సింహారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు లాహోరి బాలమ్మ, గడ్డిపర్తి చిన్ని, మైల సీతమ్మ, వడ్డెంపూడి ధనలక్ష్మి, పింగళి వెంకటరమణ, కనకబోయిన పాండురంగారావు, కామిశెట్టి అమరనాథ్, వేముల అలివేలు మంగ, తమ్మిశెట్టి సోమయ్య , నూతలపాటి రాంబాబు, పోతనబోయిన నాగమణి, గోలి రామేశ్వరి సెక్రటరీ నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

మైలవరం: మైలవరంలోని ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం అలివేలు మంగ తాయారు గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దేవాలయ ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీఎస్ నివృతరావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే స్థానిక శివాలయం వీధిలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.